క్లుప్తంగా

శ్రీసిటీ డీఎస్పీగా పైడేశ్వరరావు



శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న సెక్యూరిటీ చీఫ్ రమేష్

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ డీఎస్పీగా జీవీఎస్ పైడేశ్వరరావు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో చేసిన బదిలీలలో ఇక్కడ పనిచేసిన డీఎస్పీ జగదీష్‌నాయక్ బాపట్లకు, భీమవరం నుంచి పైడేశ్వరరావు శ్రీసిటీకి వచ్చారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, ఎస్ఐ హరిప్రసాద్, డీఎస్పీకి శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పార్లపల్లెలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో నిర్వహించనున్న ఎన్నికల నేపథ్యంలో పార్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్ గదులను సోమవారం తహసీల్దారు పఠాన్ మహ్మద్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉందా, లేదా? అని పరిశీలించినట్టు చెప్పారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులకు నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

9 నుంచి తొండమాన్‌పురం వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 9 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మార్చి 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 9న ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి శేష వాహన సేవ నిర్వహిస్తారన్నారు. రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు ఉంటాయన్నారు. మార్చి 10న హంస వాహనం, 11న సింహ వాహనం, 12న హనుమంత వాహనం, 13న సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ సేవ, 14న గజవాహనం, 15న చంద్రప్రభ వాహనం, 16న ఉదయం తిరుచ్చి, రాత్రి అశ్వ వాహన సేవలు ఉంటాయని వెల్లడించారు. 17న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహిస్తామన్నారు. 18వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగం ఉంటుందని చెప్పారు.

జిల్లాస్థాయిలో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ భువనేశ్వరి, ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : ఎడ్యుకేషన్ ఎఫిసెన్సీ మెరిట్ టెస్ట్‌లో పట్టణంలోని ఆర్బీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థి జితేంద్ర విష్ణు మెరిట్ టెస్టుకు హాజరై తిరుపతి జిల్లాలో ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో నిర్వాహకులు నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో ఎంఈఓ భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ కథనం మేరకు.. మండలంలోని అంజిమేడుకు చెందిన మునిరాజా(48) ద్విచక్ర వాహనంపై రేణిగుంట మండలంలోని మల్లవరం గ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ కాలనీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టికి గాయాలయ్యాయి. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నకు ఓటేసి రుణం తీర్చుకుందాం



ఉదమలపాడులో ప్రచారం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి(తొట్టంబేడు) : మహిళల అభ్యున్నతి కోసం పాటుపడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి ఆయన రుణం తీర్చుకుందామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఉదమలపాడు, గోపాలకృష్ణాపురం గ్రామాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు పథకాల ద్వారా నగదును మహిళల ఖాతాల్లో జమ చేశారని పేర్కొన్నారు. నిత్యం ప్రజాసేవలో ఉంటున్న నాయకుడు బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పేవారిని నమ్మితే నియోజకవర్గంలో ప్రగతి అటకెక్కుతుందని చెప్పారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సారథ్యంలో గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో సాధ్యమైందని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సర్పంచ్ మనో హర్, వైస్ ఎంపీపీ భానుయాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, కో ఆప్షన్ సభ్యులు మునిరత్నం, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, నేతలు మునిరాజ యాదవ్, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, పెంచలయ్య, గంగ య్య, రమేష్, రాధాకృష్ణ, ఈశ్వర్‌రెడ్డి, రఘురెడ్డి, భూషణ్ యాదవ్, రవీంద్రరెడ్డి, రామారావు, ప్రసా ద్, శ్రీనివాసులు, రవి, హరిరెడ్డి, సురేంద్రయాదవ్, కలివేలయ్య, మల్లి, బాల, గురునాథం, కృష్ణయ్య, ఈశ్వరయ్య, వీ మనోహర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన మహిళకు సాయం

శ్రీకాళహస్తి : ప్రమాదవశాత్తు గాయపడిన యాస్మిన్ అనే మహిళకు బియ్యపు పవిత్రారెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ అస్లాం నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న యాస్మిన్ అనే మహిళకు కొద్ది నెలల క్రితం యాక్సిడెంట్ కావడంతో ఆమె జీవనాధారం కోల్పోయింది. ఆమెకు కావాల్సిన నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం రెండు నెలలుగా 15వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్ అస్లాం వితరణ చేస్తున్నాడు. వాటిని ఆమె గాయపడిన మహిళకు అందజేశారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బియ్యపు పవిత్రా రెడ్డి

అభివృద్ధిని చూసి ఓటేయండి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి

- బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి(తొట్టంబేడు) : మండలంలో గత నాలుగన్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం లింగమనాయుడు పల్లె, కురవకనేరి, గుమ్మిడిగుంట గ్రామాల్లో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీకాళహస్తి రాజకీయంలో ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో ప్రజలతో మమేకమైన నాయకులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఒక్కరేనని గుర్తు చేశారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజల ముఖం చూడని ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి ఏదో ఓ పథకం కింద లబ్ధి చేకూర్చారని చెప్పారు. అందుకే మరింత అభివృద్ధి కోసం మరో అవకాశం ఇవ్వాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో త్రిపుర రాజ్యసభ సభ్యుడు



ఆలయ ధ్వజస్తంభం వద్ద బిప్లబ్ కుమార్ దేబ్

శ్రీకాళహస్తి : వాయులింగేశ్వరుడిని త్రిపుర రాజ్యసభ సభ్యుడు బిప్లబ్ కుమార్ దేబ్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ సతీష్ మల్లి, పీఆర్వో నాగభూషణం నాయక్ స్వాగతం పలికి, శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద శేష వస్త్రంతో సత్కరించి, స్వామి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

అన్ని రంగాల్లోనూ డేటా సైన్స్‌దే ప్రధాన పాత్ర



ఐఎస్‌పీఎస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ : డేటా సైన్స్ నేడు అన్ని రంగాల్లోనూ ప్రధాన పాత్ర పోషిస్తోందని మహిళా వర్సిటీ వీసీ భారతి తెలిపారు. మహిళా వర్సిటీ, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఎస్వీయూ సంయుక్తంగా డేటా సైన్స్‌పై మూడో రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో వీసీ భారతి, ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ డేటా సైన్స్ అనేది కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, మ్యాథమ్యాటిక్స్‌గా విభజించబడిందన్నారు. ప్రతి రంగంలోనూ డేటా సైన్స్ ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యం, ఫైనాన్స్, రిటైల్, రవాణా రంగాల్లో డేటా సైన్స్ హవా నడుస్తోందన్నారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులతో డేటా సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని చెప్పారు. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలోని డేటా సెన్స్ సెంటర్ ఏర్పాటు కావడం శుభపరిణామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఈ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎస్వీయూ సైతం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఐఎస్‌పీఎస్‌తో డిప్లొమో కోర్సుల విషయంలో ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం డేటా సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐఎస్‌పీఎస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అన్నామలై యూనివర్సిటీ వీసీ ఆర్ఎం కతిరేశన్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏఎం మథై, అట్లాంటా నుంచి ప్రొఫెసర్ ఎం సంబంధం, జీఎస్ నటరాజన్, ఎస్ఆర్ శ్రీనివాసులు, ముళీధరన్, ఐఎస్‌పీఎస్ సెంటర్ గౌరవాధ్యక్షులు పి రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌వోడీ ఎం శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

- టీచర్ల శిక్షణతరగతుల్లో ఎంఈఓ రవి



ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: తరగతి గదిలో విద్యార్థి కేంద్రంగా అత్యుత్తమ విద్యాబోధన చేయడంతోపాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంఈఓ కే.రవి అన్నారు . సోమవారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ సెంటర్ (సీఆర్సీ)లో జీవశాస్త్రం టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే కాలానుగుణంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని బోధనా నైపుణ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తోందన్నారు. ఎస్ఏ-1 ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి డి-గ్రూప్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు మరింత శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 ఉష, క్లస్టర్ హెచ్ఎం ఎం. మొహిద్దీన్, రిసోర్స్ పర్సన్లు జహంగీర్, కే.మధు, సురేష్, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన జీవశాస్త్రం టీచర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వలంటీర్లు వారధులని, వలంటీర్లు సేవలకు ప్రతి రూపాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ ప్రస్తుతించారు. సోమవారం పల్లమాల గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ, కరోనా కష్టంలో వలంటీర్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మునికృష్ణయ్య పాల్గొన్నారు.



పల్లమాలలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

వేడుకగా ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర

తిరుపతి కల్చరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరంలో శివాజీ మహారాజ్ చిత్రపటంతో శోభాయాత్ర చేపట్టారు. రామచంద్ర పుష్కరిణి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎన్టీఆర్ సర్కిల్, ప్రకాశం రోడ్డు, నాలుగు కాళ్ల మండపం, పాత మున్సిపల్ ఆఫీస్, వీవీ మహల్ రోడ్డు, రామకృష్ణ డీలక్స్ మీదుగా తిరిగి రామచంద్ర పుష్కరిణి వరకు సాగింది. పిల్లలు ఛత్రపతి శివాజీ వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారుడు ఎస్.వెంకట్రావు, అధ్యక్షుడు ఎం.మదన, కార్యదర్శి జాజం సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి యోగేశ్వర్‌రావు, మరాఠ వెంకట సోమాజీరావు, ఎస్.ఎర్రమరావు, హరిణి, చంద్రశేఖర్‌రావు, హేమంత్ రావు పాల్గొన్నారు.



శోభాయాత్రలో మరాఠ సేవా సంఘం ప్రతినిధులు

కుష్ఠుపై గిరిజనులకు అవగాహన



కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్య

- వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు
- చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి చొరవతో రాత్రివేళ కుష్ఠు సర్వే

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం పంచాయతీ రామిరెడ్డిపాళెం గిరిజనకాలనీలో ఆదివారం రాత్రి కుష్ఠు వ్యాధిపై వైద్య బృందం అవగాహన కల్పించింది. తొలుత ఇంటింటా సర్వే నిర్వహించారు. జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి రాజ, చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారిణి లావణ్య, ఫిజియో థెరపిస్ట్ వెంకటరమణ వైద్య సిబ్బందితో కలసి గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాల గురించి తెలియజేశారు. ఇప్పటికే గిరిజన కాలనీలో గుర్తించిన 8 మంది గిరిజనులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రుడు, ఏఎన్ఎం కామేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు బేబి, లోకేశ్వరిలు పాల్గొన్నారు.

వైద్యాధికారిణి చొరవతో సదస్సు

రామిరెడ్డిపాళెం గిరిజనకాలనీలో పలువురు కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అయితే ఆ కాలనీలో అందరూ రోజువారీ కూలీలుగా, మరికొందరు వ్యవసాయ తోటల వద్ద కాపలాదారులుగా జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పించేందుకు వైద్యసిబ్బంది ఇటీవల పలుమార్లు రామిరెడ్డిపాళెం గిరిజనకాలనీకి వెళ్లినప్పటికీ అక్కడ స్థానికులు పగటిపూట అందుబాటులో ఉండటం లేదు. దీంతో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారిణి లావణ్య ఆదివారం సెలవు దినం అయినప్పటికీ కూలీలు పనులకు వెళ్లి రాత్రి 7 గంటలకు ఇళ్లకు వచ్చేంత వరకు తమ సిబ్బందితో వేచి ఉండి రాత్రి 10 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. అలాగే ఆ వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకు గ్రామంలో జిల్లా వైద్య బృందంతో అవగాహన కల్పించారు.

నూతన తెప్పల నిర్మాణం వేగవంతం చేయండి



తెప్పల తయారీ పనులు పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.27లక్షలతో నిర్మిస్తున్న నూతన తెప్పలు పనులను వేగవంతం చేయాలని ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆయన తెప్పల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వాయులింగేశ్వర క్షేత్రంలోని నారద పుష్కరిణిలో మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తారన్నారు. తెప్పోత్సవాలకు గతంలో టీటీడీ నుంచి తెప్పలును తెప్పించుకుని ఉత్సవాన్ని నిర్వహించేవారమన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో ధర్మకర్త మండలి సమావేశంలో తెప్పలు తయారు చేయించాలని తీర్మానించామన్నారు. ఈ నేపథ్యంలో నూతన తెప్పలు తయారు చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుదర్శన్‌రెడ్డి, పసుపులేటి కామేశ్వరరావు, శీను ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూమి పంపిణీ చేయాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూలోని భూసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ దళితులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, కుక్కంబాకం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81లోని మిగులు భూములను భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలన్నారు. భూములు లేక కూలీ పనులకు వెళుతున్నామని, మిగులు భూమిని పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్లు..



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

తమకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా జీతాలు ఇవ్వడం లేదని నిరసిస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో తాము సేవలు అందిస్తున్నామన్నారు. రెండేళ్లుగా కేంద్రం జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అగచాట్లు పడుతున్నామని, అప్పులు కూడా పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు సంబంధించి జీఓ 680 విడుదల చేసి 10 నెలలు గడిచినా ఇంకా అమలుకు నోచుకోలేదని నిరసించారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ. 26 వేల జీతం ప్రతి నెలా ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని సమస్యలపై నినదించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ త్రివిక్రమ్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

సీఆర్‌సీ మీటింగ్‌కు వెళ్తూ..

- గాయపడిన టీచర్



గాయపడిన ఆనంద్

నాగలాపురం: మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో కింద పడి ఉపాధ్యాయుడు గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. సత్యవేడు మండలం ఆరూరు ఎంపీపీ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న ఆనంద్ (53) పాలసముద్రం నుంచి మదనంబేడు పాఠశాలలో సీఆర్‌సీ మీటింగ్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. కారణి సమీపంలో ఎదురుగా లారీ వేగంగా వస్తుండగా తన బైకును కంట్రోల్ చేయలేక అదుపు తప్పి రోడ్డు పక్కన పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని కాళ్లకు తీవ్రగాయమైంది. ఆయన్ను స్థానికులు 108లో నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సెక్యూరిటీని పెంచండి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రయాణించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. అదే స్థాయిలో పోలీస్ సెక్యూరిటీని పెంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఎస్పీ మలికగార్గ్‌ను ఎస్పీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లె వెలుగు బస్టాండ్లు, వాటి నుంచి ప్రయాణించే వారి వివరాలను ఎస్పీకి వివరించారు. రోజు 1.60 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని వెల్లడించారు. వేసవి వస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, తాము ఎంత పటిష్ట చర్యలు చేపట్టినా అక్కడక్కడా చోరీలు జరుగుతున్నాయని చెప్పారు.

జ్వరాలపై అప్రమత్తం



నారాయణవనంలో ర్యాలీ చేస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

నారాయణవనం: దోమల మూలాన వచ్చే వివిధ జ్వరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు. సోమవారం నారాయణవనంలో వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాగసుధ మాట్లాడుతూ, దోమ కాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యా, సాధారణ జ్వరాలు వస్తాయని అన్నారు. నారాయణవనం ప్రాంతంలో క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా బాధితులను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే విధిగా అందరూ పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షణ్ముగం మాట్లాడుతూ, గృహిణులు చెత్తను వీధుల్లో పారబోయకుండా ఉదయం వీధుల్లో వచ్చే ట్రాక్టర్‌లో వేయాలని, అలాగే మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వస్తువులు, చెత్తను వేయరాదని కోరారు. దీని వలన పారిశుద్ధ్యం సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. దోమల నిర్మూలనకు సోమవారం నుంచి ఫాగింగ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య, సచివాలయ కార్యదర్శులు తిరుమలేష్, సరిత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.